

### అజయ్ పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమైంది..

ఖమ్మం ప్రజలు నాడు నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొనేవారని సీఎం అన్నారు. కాలువలు ఇరుకుగా ఉండేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గోళ్లపాడు చానల్‌ను ఆధునీకరించి నగర ప్రజలను మురికి కూపం నుంచి మంత్రి అజయ్ బయటపడేశారన్నారు. నేడు ఖమ్మం అభివృద్ధి సాధించిందంటే మాయ చేస్తేనో, మంత్రం వేస్తేనో కాదని అన్నారు. అజయ్ పట్టుబట్టి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమైందని స్పష్టం చేశారు. 'వాడ వాడకు పువ్వాడ' పేరుతోసైకిల్ తొక్కుతూ ఇంటింటికీ వెళ్లి సమస్యలు పరిష్కరించిన తీరు అద్భుతమన్నారు. ఆ వార్తలను తాను పత్రికల్లో చూశానన్నారు. మున్నేరు ముప్పు తొలగిపోవాలని తీగల వంతెన, వాల్స్ నిర్మాణానికి నిధులు విడుదల చేయించుకున్నారని గుర్తుచేశారు.

# 'పువ్వాడ'కు పట్టం కట్టండి

- మంత్రి అజయ్ పట్టుబట్టి పనిచేస్తేనే మనం ప్రగతిని చూస్తున్నాం..
- తుమ్మల నాగేశ్వరరావును తెచ్చుకుంటే తుమ్మ ముల్లు గుచ్చుకున్నట్లే..
- ఓడిపోయి ఇంట్లో కూర్చున్న తుమ్మలకు మంత్రి పదవి ఇచ్చాను..
- గత ఎన్నికల్లో పార్టీకి ఆయన చేసిన మేలు గుండు సున్నా..
- పైగా నాకే మంత్రి పదవి ఇప్పించానని గప్పాలు
- ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభలో సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

ఖమ్మం, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మలను తెచ్చుకుంటే తుమ్మ ముల్లు గుచ్చుకున్నట్లేనని, బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడను గెలిపించుకుంటే ప్రజలను పువ్వుల్లో పెట్టి చూసుకుంటారని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అధ్యతన నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. నగరంలో అభివృద్ధికి కొనసాగింపు ఉండాలంటే ప్రజలు పువ్వాడను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రాజకీయ చైతన్యానికి కొదువ లేదన్నారు. జిల్లాకు చెందిన కవి దివంగత రావెళ్ల వెంకట రామారావు 70 ఏళ్ల క్రితమే తెలంగాణపై గొప్ప కవిత్వం రాశారని గుర్తుచేశారు. ఇక్కడి ప్రజలు విజ్ఞులని, ఎవరిని.. ఎందుకు.. గెలిపించుకోవాలో వారికి తెలుసన్నారు. ప్రజలు ఓటు వేసే సమయంలో అభ్యర్థుల గుణంతోపాటు గణం చూడాలన్నారు. వెనుక ఉన్న రాజకీయపార్టీని కూడా చూడాలన్నారు. ఆ పార్టీకి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చగల శక్తి ఉందో.. లేదో.. బేరీజు వేసుకోవాలన్నారు. పని చేసే పార్టీకి ఓట్లు వేస్తే ప్రజలే గెలిచినట్లు అవుతుందన్నారు. ఓటు వజ్రాయుధమన్నారు. ప్రజలు ఆ ఆయుధాన్ని మంచి మార్పు కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ 'విజన్' మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 'మిషన్' తోడైతేనే అభివృద్ధికి బాటలు పడతాయన్నారు.

**ఇంట్లో కూర్చున్న నేతకు మంత్రి పదవి ఇచ్చాను..**

2014 ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో కూర్చున్న ఓ నేతకు మంత్రి పదవి ఇచ్చానని ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి కేసీఆర్ అన్నారు. కానీ 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్క అజయ్‌కుమార్ తప్ప గెలవలేదన్నారు. మొత్తంగా తుమ్మల పార్టీకి చేసిన ప్రయోజనం గుండు సున్నా అన్నారు. ఓడిపోయిన తుమ్మలకు మంత్రి పదవి వస్తే, ఆయన రివర్స్‌లో తనకు మంత్రి పదవి ఇప్పించానని గప్పాలు కొడుతున్నారని మండిపడ్డారు.

**కరకట దమనుల పీడ వదిలింది..**

జిల్లాలో కరకట దమనులు ఇద్దరు ఉన్నారని, వారు ఎవరో, వారి వ్యవహార శైలి ఏమిటో తెలుసుకోవాలంటే చిన్నయసూరి రాసిన కథ చదవాల్సిందేనని సీఎం అన్నారు. కరకట దమనులు బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వమని అవాకులు చెవాకులు పేలుతున్నారన్నారు. జిల్లా ప్రజలను వాళ్లేమైనా ఏమైనా గుత్తా పట్టారా..? ఇంతటి నియంతృత్వాన్ని చైతన్యవంతమైన ప్రజలు భరిస్తారా? అని ప్రశ్నించారు. కరకట దమనుల పీడ బీఆర్‌ఎస్‌కు వదలిందన్నారు. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వర్గాలకు చేసిందేమీ లేదన్నారు. ఆ పార్టీ మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా దశాబ్దాలుగా వాడుకున్నదని ఉర్దూలో మాట్లాడి సభికులను ఆకట్టుకున్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ మైనార్టీల అభ్యున్నతికి ఏటా రూ.900 కోట్లు వెచ్చిస్తే, ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకంగా రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. తెలంగాణను సెక్యూలర్ రాష్ట్రంగా కాపాడతామన్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ముస్లింలు అజయ్ ఖాన్‌గా పిలుచుకోవడం తనను అబ్బుర పరిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీ ప్రజలు అజయ్‌ఖాన్‌ను ఆశీర్వదించాలన్నారు.

**ఎన్నికలు రాగానే ప్రతిపక్ష పార్టీల అభివృద్ధి మంత్రం..**

ఎన్నికలు రాగానే అభివృద్ధి మంత్రాలను జపించే కాంగ్రెస్, బీజేపీలు ఏనాడైనా తెలంగాణ జెండా పట్టుకున్నాయా? తెలంగాణ కోసం నినదించాయా? అని సీఎం ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే లైట్ హైదరాబాద్‌లో, స్విచ్ ఢిల్లీలో ఉంటుందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి గులాములని అభివర్ణించారు. అజయ్‌కుమార్ కృషితోనే ఖమ్మంలో ఐటీ హబ్ అందుబాటులోకి వచ్చిందన్నారు. జిల్లాకు వైద్య కళాశాల కావాలని అజయ్‌కుమార్ పట్టుబట్టి మంజూరు చేయించుకున్నారన్నారు. నగరంలో సకల హంగులతో బస్టాండ్ నిర్మించారన్నారు. అలాగే ఆర్టీసీ కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుకున్నారని కొనియాడారు. తాగునీటి కోసం యుద్ధాలు జరిగిన ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పుడు మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లాలు వచ్చాయన్నారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, లింగాల కమల్‌రాజు, బానోతు మదన్‌లాల్, ఎమ్మెల్యే రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణచైతన్య, ఏఎంసీ చైర్మన్ శ్వేత, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరి రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జనం.. ప్రభం'జనం'

## ప్రజా ఆశీర్వాద సభలకు ఉప్పెనలా కదిలిన ప్రజలు

**ఖమ్మం, కొత్తగూడెం సభలు గ్రాండ్ సక్సెస్**

**సీఎం కేసీఆర్ ప్రసంగానికి కరతాళ ధ్వనులు**

ఖమ్మం, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం, కొత్తగూడెంలలో ఆదివారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలకు లక్షలాదిగా ప్రజలు తరలొచ్చారు. సభా ప్రాంగణాలు జన సునామీలను తలపించాయి. ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను చూసేందుకు ముందుగానే సభా స్థలాలకు చేరుకున్నారు. కేసీఆర్ వేదికపైకి వచ్చే వరకు వారంతా ఓపికగా ఎదురుచూశారు. రెండుచోట్లా వీధులన్నీ గులాబీమయ్యాయి. కేసీఆర్ ప్రత్యర్థులను ఉద్దేశించి వదిలిన వాగ్బాణాలకు సభల నుంచి కరతాళ ధ్వనులు మిన్నంటాయి. బీఆర్‌ఎస్ శ్రేణులు ఉత్సాహంగా కేసీఆర్‌కు జై కొట్టారు. కొత్తగూడెం సభలో తెలంగాణ ఉద్యమ సమయంలో కొత్తగూడెం ప్రజలు నిర్వహించిన పాత్రను కొనియాడగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడకపోతే కొత్తగూడెం జిల్లా అయ్యేదా? పోడు భూములకు పట్టాలు వచ్చేవా? ప్రతి ఇంటికి సంక్షేమం వచ్చేదా? 'అంటూ చేసిన ప్రసంగానికి సభ చప్పట్లతో మోగిపోయింది. కొత్తగూడెంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమాను, ఖమ్మంలో పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించి రాజకీయ చైతన్యాన్ని చాటాలని పిలుపునివ్వగా పార్టీ శ్రేణులు జై కొడుతూ ప్రతిస్పందించాయి. కాంగ్రెస్ నేతలు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలపై వారి పేర్లు ప్రస్తావించకుండానే పరోక్షంగా సీఎం మాటల దాడి చేశారు. సీఎం వ్యాఖ్యలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.

# సింగరేణి గడ్డపై గులాబీ జెండా ఎగరాలె..

- కాంగ్రెస్ పాలనలో అప్పులు.. స్వరాష్ట్రంలో లాభాలు..
- మా ప్రగతిని చూడండి.. 'వనమా'ను గెలిపించండి
- కొత్తగూడెం ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం నియోజకవర్గం పూర్తిగా సింగరేణి ప్రాంతమని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఇక్కడ గులాబీ జెండా మాత్రమే ఎగరాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ సింగరేణిని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. ఆనాడు సింగరేణిలో లాభాలు కేవలం రూ.60 కోట్లు ఉండేవని, తెలంగాణ వచ్చాక ఆ లాభాలను రూ.700 కోట్లకు తీసుకొచ్చామని అన్నారు. కొత్త నియమకాలు చేపట్టడంతోపాటు వారసత్వ ఉద్యోగాలు కూడా ఇచ్చామన్నారు. గతంలో వాటిని పోగొట్టిన నీచ చరిత్ర కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలకే దక్కుతుందని ధ్వజమెత్తారు. గని ప్రమాదంలో ఎవరైనా ఉద్యోగి మరణిస్తే గతంలో కేవలం రూ.లక్ష మాత్రమే పరిహారం ఉండేదని, ప్రస్తుతం ఆ పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచామని వివరించారు.



సభా వేదికపై సీఎం కేసీఆర్, చిత్రంలో ఎంపీలు నామా, వద్దిరాజు, పార్థసారథిరెడ్డి, విప్ రేగా, ఎమ్మెల్యే హరిప్రియ

**ఎన్నికల్లో ప్రజలే గెలవాలి..**

'పావన గోదావరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. గోదావరిని దృష్టిలో ఉంచుకునే జిల్లాకు భద్రాద్రి జిల్లా అని నామకరణం చేశాం. ఎలక్షన్లు వస్తాయి.. పోతాయి.. కానీ ప్రజల్లో పరిణితి రావాలి. ప్రపంచంలో ఇప్పటికే చాలా దేశాలు పరిణితి చెందాయి. అలాగే మన దేశమూ పరిణితి చెందాలి. అప్పుడే మంచి నాయకులు ప్రజాప్రతినిధులవుతారు. ప్రజల చేతిలో ఓటు అనే వజ్రాయుధం ఉంది. అలాంటి ఓటు వేస్తే ప్రజలే గెలవాలి.. వనమా వెంకటేశ్వరరావుకు సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉంది.. అలాంటి వ్యక్తిని ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలి..' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

**కరెంట్ కష్టాలు తీర్చాం..**

ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ చూసినా చీకటి అలుముకునేదని, రాష్ట్రం వచ్చిన తర్వాతే చీకట్లు తొలగిపోయాయని సీఎం అన్నారు. పంటలకు సాగునీరు అందక, కరెంట్ కోతలతో వేగలేక రైతులు నాడు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వారి కష్టాలు తీరిస్తూ ఇప్పుడు పంటలకు 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇస్తున్నామన్నారు. ఎప్పుడు స్విచ్ చేసినా పొలానికి సాగు నీరు పారే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేయిస్తామన్నారు.

**ప్రభుత్వ వైద్యం మెరుగుపడింది..**

నాడు ప్రజలకు సుస్తీ చేసి సర్కారు దవాఖాన వరకు వెళ్లి అక్కడి దుస్థితిని చూసి తిరిగి వెనక్కి వచ్చేవారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయడంతో ప్రతిఒక్కరూ సర్కారు దవాఖానలకే వెళ్తున్నారని సీఎం వివరించారు. తమ ప్రభుత్వం కొత్తగూడేనికి ఇప్పుడు మెడికల్ కాలేజీ ఇచ్చిందని, వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని గుర్తుచేశారు. పోడు రైతులకు పట్టాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఒక్క కొత్తగూడెం నియోజకవర్గంలోనే 16,765 ఎకరాల భూమికి పట్టాలు అందించామని వివరించారు. ఎస్సీల కోసం దళితబంధు పథకాన్ని తెచ్చామన్నారు.

**'వనమా'ను గెలిపించుకోవాలి..**

బీఆర్‌ఎస్ నడక ఏమిటో ప్రజలు గమనించాలని సీఎం అన్నారు. మంచీ చెడు ఆలోచించి ఓటు వేయాలని, కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు పెట్టే అవకాశం లేకుండా వారి సమస్యలను పరిష్కరించామని అన్నారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రగతిని గమనించి తమ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్, భద్రాచలం అభ్యర్థి తెల్లం వెంకట్రావు, టీబీజీకేఎస్ నేతలు వెంకట్రావు, రాజిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు కంచర్ల చంద్రశేఖరావు, దిండిగాల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, నాయకులు కోనేరు సత్యనారాయణ, తాళ్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ పాలనలోనే కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి: వనమా



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 5: బీఆర్‌ఎస్ పాలనలోనే కొత్తగూడెం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పార్టీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగిన వెంటనే సీఎం కేసీఆర్ నిధులు ఇచ్చారని గుర్తుచేశారు. ఐదేళ్లలో సుమారు రూ.3,000 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. అడిగిన వెంటనే ఇండ్ల స్థలాల క్రమబద్ధీరణకు జీవో విడుదల చేశారన్నారు. దీంతో కొత్తగూడెంలో ఎంతో మంది ఇంటి యజమానులు అయ్యారని కొనియాడారు. సింగరేణి గనుల కారణంగా ఇండ్లు కోల్పోయిన ఎస్ఆర్టీ నగర్, మాయాబజార్ వాసులు, రైల్వే నిర్వాసితులు సుమారు 900 మందికి ఇండ్ల స్థలాలను ఇప్పించామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో కొత్తగా అనేక రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని అన్నారు.